సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

7

గురువారం, 8, ఆగస్టు, 2024

న్యూస్‌రీల్

ఆశ్రమ విద్యార్థికి మలేరియా

- అప్రమత్తమైన అధికారులు



జడ్డంగి బాలికల ఆశ్రమ పాఠశాలలో బాలికలకు మలేరియా రక్త పరీక్ష చేస్తున్న వైద్య సిబ్బంది

రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగి ఆశ్రమ పాఠశాల విద్యార్థినికి బుధవారం మలేరియా పాజిటివ్ నిర్ధారణ అయినట్టు మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ ప్రసాద్ తెలిపారు. దీంతో వెంటనే అప్రమత్తమై పాఠశాలలోని 55 మంది విద్యార్థులకు మలేరియా పరీక్షలు నిర్వహించామని ఆయన తెలిపారు. అదేవిధంగా పాఠశాల పరిసరాల్లో ఫాగింగ్, దోమల నివారణ మందు ద్రావణం పిచికారీ పనులు చేపడుతున్నామని ఆయన తెలిపారు. తప్పనిసరిగా దోమతెరలు ఉపయోగించాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు.

రేవళ్లు పంచాయతీ కార్యదర్శిపై విచారణ



రేవళ్లు గ్రామ సచివాలయంలో విచారణ చేస్తున్న ఈవోఆర్‌డీ ప్రసాద్

కొయ్యూరు: రేవళ్లు పంచాయతీ కార్యదర్శి రవికుమార్‌పై ఈవోఆర్‌డీ ఎస్‌కెపీ ప్రసాద్ బుధవారం అక్కడి గ్రామ సచివాలయంలో విచారణ నిర్వహించారు. కార్యదర్శి అనుచితంగా ప్రవర్తించారని సర్పంచ్ జె వెంకటలక్ష్మి ఎంపీడీవో సీతయ్యకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఆయన ఆదేశాల మేరకు ఈవోఆర్‌డీ ప్రసాద్ విచారణ నిర్వహించారు. సర్పంచ్, కార్యదర్శి నుంచి రాతపూర్వకంగా వివరాలు తీసుకున్నారు. అనంతరం ఈవోఆర్‌డీ విలేకరులతో మాట్లాడుతూ విచారణ నివేదికను ఎంపీడీవోకు అందజేస్తామని తెలిపారు.

రంగురాళ్లు తవ్వితే కేసులు

- పెదవలస అటవీశాఖ రేంజ్ శివరంజని



సమావేశంలో మాట్లాడుతున్న పెదవలస రేంజ్ అధికారి శివరంజని

చింతపల్లి: అటవీప్రాంతాల్లో అక్రమంగా రంగురాళ్ల తవ్వకాలకు పాల్పడినా, తవ్వకాలను ప్రోత్సహించినా వారిపై శాఖాపరంగా కేసులు నమోదు చేస్తామని పెదవలస అటవీశాఖ రేంజ్ శివరంజని అన్నారు. బుధవారం ఆమె చింతపల్లిలో బేస్‌క్యాంప్, టాస్క్‌ఫోర్సు సిబ్బందితో సమావేశమయ్యారు. పెదవలస రేంజి పరిధిలోని సిగనాపల్లి క్వారీలో తరచూ రంగురాళ్ల తవ్వకాలు జరుగుతున్నాయని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఈవిషయాన్ని తాము తీవ్రంగా పరిగణిస్తున్నామన్నారు. రంగురాళ్ల తవ్వకాలకు పాల్పడే వారితో పాటు తవ్వకాలను ప్రోత్సహించే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. కొండపై తవ్వకాలకు పాల్పడకుండా క్వారీపై నిరంతర నిఘా ఏర్పాటు చేశామన్నారు. బేస్‌క్యాంపు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

వన్యప్రాణులను హతమారిస్తే కఠిన చర్యలు



చనిపోయిన కొండచిలువ, ఖననం చేస్తున్న అటవీశాఖ సిబ్బంది

గంగవరం : వన్య ప్రాణులను హతమారిస్తే కఠిన చర్యలు తప్పవని అటవీశాఖ ఫోక్సుపేట రేంజ్ అధికారి ఎం.కరుణాకర్ హెచ్చరించారు. గంగవరం గ్రామ శివారులో హతమార్చిన ఉన్న కొండచిలువను బుధవారం అటవీశాఖ అధికారులు గుర్తించారు. ఈ విషయాన్ని డీఎఫ్‌వోకు తెలియజేశారు. ఆయన ఆదేశాల మేరకు అదే ప్రదేశంలో ఖననం చేసినట్టు రేంజ్ అధికారి తెలిపారు. ఫారెస్ట్‌అధికారులు నూకరాజు, జగదీష్, మనోహర్, పద్మ తదితరులు పాల్గొన్నారు. కొండ చిలువ, ఉడుము, చిరుత, పెద్దపులి వంటి జంతువులను హతమారిస్తే ఏడేళ్ల జైలు శిక్ష పడుతోందని తెలిపారు. వన్యప్రాణులు కనిపిస్తే అది హాని అని అనిపిస్తే అటవీసిబ్బందికి సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు.







డల్లాపల్లి అదరహో

ప్రకృతి మలచిన పర్యాటక ప్రదేశాల్లో మన్యం ఎప్పుడూ ప్రత్యేకమే. పచ్చని ప్రకృతి ఒడిలో సహజసిద్ధంగా పుట్టుకొచ్చిన అందాల్లో డల్లాపల్లి ఘాట్ ఒకటి. ఈ ప్రాంతంలో బుధవారం నింగి నేలను తాకుతున్నట్టుగా మేఘాలు అబ్బురపరిచాయి. సీజన్ ఏదైనా అందాలు కనువిందు చేస్తుంటాయి. ఇక్కడ అడుగుపెట్టగానే ఉల్లాసం పొంగుకొస్తుంది. మేఘాల్లో తేలియాడాలని, కొండల అంచులను తాకాలనే ఉద్వేగం మనసును ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. – సాక్షి, పాడేరు

వరద వర్రీ



గోదావరి వరదకు పోటెత్తిన నందిగామ వాగు

- విలీన మండలాల్లో ఎడతెరిపి లేకుండా వర్షం
- పొంగిన వాగులు
- చింతూరు, వీఆర్ పురం మండలాల్లో 35 గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- భద్రాచలం వద్ద పెరుగుతున్న గోదావరి నీటిమట్టం
- సాగునీటి ప్రాజెక్టులకు వరద తాకిడి

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు విలీన మండలాల ప్రజలను అవస్థలకు గురి చేస్తున్నాయి. మొన్నటివరకు గోదావరి, శబరి వరదలు.. ఇప్పుడు వాగులు చుట్టుముట్టడంతో చింతూరు, వీఆర్‌పురం మండలాల్లోనే సుమారు 35 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.



చింతూరు మండలంలో సోకిలేరు వాగులో రాకపోకలు సాగిస్తున్న ప్రజలు



పొంగి ప్రవహిస్తున్న కన్నాపురం అలుగువాగు ప్రాజెక్టు

ఎటపాక: తుఫాను ప్రభావంతో రెండురోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. దీంతో గోదావరి నదికి వరద క్రమేపీ పెరుగుతోంది. బుధవారం సాయంత్రం 6 గంటలకు భద్రాచలం వద్ద 35.3 అడుగులకు నీటిమట్టం పెరిగింది. మరో మూడు రోజులు భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున గోదావరికి వరద పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. మండలంలోని కన్నాపురం అలుగువాగు ప్రాజెక్టు నిండుకుండను తలపిస్తోంది. ప్రాజెక్టుకు వరద పోటెత్తడంతో కుడి కాలువ కట్టకు జిన్నెగట్టు వద్ద గండి పడింది. ముర్రుమూరు, నందిగామ, తోటపల్లి, నెల్లిపాక, రాయనపేట వాగులకు వరద ఉధృతి నెలకొంది. మిర్చి నారుమడులు తయారు చేసుకుంటున్న రైతులు తుఫాను కారణంగా ఇబ్బందులు పడుతున్నారు.

చింతూరు: భారీ వర్షానికి వాగులు పొంగడంతో మండలంలో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఏకధాటిగా వర్షం కురవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

- వీఆర్‌పురం మండలంలో బుధవారం మధ్యాహ్నం నుంచి అన్నవరం వాగు పొంగి వరదనీరు రహదారిపై నుంచి ఉధృతంగా ప్రవహించింది. అప్పటికే వరినాట్లు వేసేందుకు అవతలి పక్క వెళ్లిన జీడిగుప్ప, వడ్డిగూడెం, రేఖపల్లి, వీఆర్‌పురంకు చెందిన వందలాది మంది వ్యవసాయ కూలీలు వాగు దాటేందుకు ఇబ్బందులకు గురయ్యారు. ఒకరికొకరు సాయంతో అందరూ ఒకేసారి ప్రాణాలకు తెగించి సురక్షితంగా ఇవతలి వైపునకు చేరుకున్నారు.
- చింతూరు మండలంలో జల్లివారిగూడెం, సోకిలేరు వాగులు కూడా పొంగడంతో వరదనీరు రహదారి పైనుండి ప్రవహించింది. చింతూరు, వీఆర్‌పురం మండలాల రాకపోకలు స్తంభించడంతో 20 గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. దీంతో పాటు మండలంలోని 15 గ్రామాలకు కూడా రాకపోకలు నిలిచిపోయాయి.

గర్భిణి నరకయాతన

- విషమంగా ఆరోగ్య పరిస్థితి
- రోజంతా ప్రభుత్వాస్పత్రుల చుట్టూ తిప్పిన కుటుంబ సభ్యులు
- ఎట్టకేలకు అర్ధరాత్రి వేళ భద్రాచలంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలింపు
- శస్త్ర చికిత్స చేసి మృత శిశువును బయటకు తీసిన వైద్యులు
- తల్లికి తప్పిన ప్రాణాపాయం



గర్భిణి శిరీషను చింతూరు ఏరియా ఆస్పత్రి నుంచి 108లో భద్రాచలం తరలిస్తున్న సిబ్బంది

వీఆర్‌పురం (చింతూరు): ప్రసవవేదనతో బాధపడుతున్న గర్భిణి రోజంతా నరకయాతన అనుభవించింది. పరిస్థితి విషమంగా మారడంతో ఆమె ప్రాణాలు కాపాడుకునేందుకు కుటుంబసభ్యులు ప్రభుత్వాస్పత్రుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. చివరికి అర్ధరాత్రి వేళ భద్రాచలంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించడంతో ప్రాణాపాయస్థితిలో ఉన్న ఆమెకు అక్కడి వైద్యులు శస్త్రచికిత్స చేశారు. అయితే గర్భంలోనే శిశువు మృతి చెందడంతో తల్లి ప్రాణాన్ని మాత్రమే వారు కాపాడగలిగారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కల్తనూరుకు చెందిన కెచ్చెల శిరీష అనే గర్భిణికి మంగళవారం పురిటినొప్పులు రావడంతో కాన్పు నిమిత్తం ముందుగా జీడిగుప్ప పీహెచ్‌సీకి తీసుకువెళ్లారు. అక్కడి వైద్యులు పరీక్షించి రేఖపల్లి పీహెచ్‌సీకి పంపినట్లు భర్త హరిశ్చంద్ర తెలిపారు. అక్కడ పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని చింతూరు ఏరియా ఆస్పత్రికి తరలించినట్టు అతను తెలిపాడు. చింతూరు ఏరియా ఆస్పత్రిలో సైతం వైద్యులు పరీక్షించి పరిస్థితి విషమంగా ఉందని చెబుతూ రాత్రి 11 గంటల సమయంలో 108 వాహనంలో భద్రాచలం పంపారని తెలిపారు. అయితే ఆందోళనకు గురైన తాము భద్రాచలంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించామన్నారు. అర్ధరాత్రి శస్త్రచికిత్స చేసిన అక్కడి వైద్యులు శిశువు గర్భంలోనే మృతిచెందినట్లు చెప్పారని హరిశ్చంద్ర తెలిపాడు. ఇలావుండగా శిరీషకు కాన్పు కష్టంగా మారి పరిస్థితి విషమంగా ఉండటంతో భద్రాచలం రిఫర్ చేసినట్లు డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పుల్లయ్య తెలిపారు.

మ్యుటేషన్ దరఖాస్తులు పరిష్కరించండి

- కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం
- జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్సు

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న మ్యుటేషన్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ ఆదేశించారు. బుధవారం తన కార్యాలయం నుంచి ఐటీడీఏ పీవోలు, సబ్‌కలెక్టర్లు, తహసీల్దార్లతో వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మ్యుటేషన్లపై అనేక ఫిర్యాదులు వస్తున్నాయని, వీటి విషయంలో ఇష్టానుసారంగా చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు భూ సమస్యలను పరిష్కరించాలని, రికార్డుల ప్రకారం వారసత్వ భూములను వారి కుటుంబ సభ్యులకు మార్పిడి చేయాలని ఆదేశించారు. తహసీల్దార్లు అఫిడవిట్‌లు అడగవద్దని, కుల ధ్రువీకరణ పత్రాలు పక్కాగా పరిశీలించాలని ఆయన సూచించారు. అనంతరం ఎంపీడీవోలతో మాట్లాడారు. ఉపాధి హామీ పథకంలో మొక్కలు నాటే పనులు వేగవంతం చేయాలని సూచించారు. గ్రామాలలో తాగునీటి సమస్యల పరిష్కారంతో పాటు తాగునీటి వనరుల క్లోరినేషన్ పనులు జరగాలన్నారు. వర్షాకాలంలో ప్రజలకు అంటువ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని, పారిశుధ్య పనులు విస్తృతం చేయాలని ఆదేశించారు. మలేరియా కేసుల తీవ్రత, మరణాలు సంభవిస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. అన్ని సచివాలయాల పరిధిలో ఫీవర్ సర్వేలు చేపట్టడమే కాకుండా అన్ని మండలాల్లో ఆధార్ కార్డుల సమస్యలు పరిష్కరించే విధంగా ఆధార్ సర్వే చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో కలెక్టరేట్ నుంచి జేసీ డాక్టర్ అభిషేక్ గౌడ్, రంపచోడవరం నుంచి ఐటీడీఏ పీవో కె.సింహాచలం, సబ్‌కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, చింతూరు నుంచి ఐటీడీఏ పీవో కావూరి చైతన్య, డీపీవో కొండలరావు, డీఎల్పీవో పీఎస్ కుమార్, జిల్లా ఉద్యానవన అధికారి రమేష్‌కుమార్‌రావు పాల్గొన్నారు.

వికటించిన నాటుమందు

బాలుడి పరిస్థితి విషమం



భద్రాచలం తరలించక ముందు చింతూరు ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పవన్

చింతూరు : నాటుమందు వికటించడంతో బాలుడి పరిస్థితి విషమంగా మారింది. దీంతో మెరుగైన వైద్యం నిమిత్తం భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. సరిహద్దున ఉన్న ఒడిశాలోని మదుగూరుకు చెందిన కొవ్వాసి దూలయ్య, రాజమ్మ ఐదేళ్ల కుమారుడు పవన్ అనారోగ్యానికి గురయ్యాడు. స్థానిక ఏరియా ఆస్పత్రికి తీసుకొచ్చేందుకు ప్రయత్నించాయి. అయితే వాగు పొంగి ప్రవహిస్తుంటంతో రాలేని పరిస్థితి ఏర్పడిందని అతని తల్లి రాజమ్మ తెలిపింది. దీంతో తన తండ్రి సూచన మేరకు బిడ్డకు నాటుమందు తాగించగా ఆరోగ్య పరిస్థితి విషమించిందని తెలిపింది. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఏర్పడటంతో పడవ సాయంతో వాగు దాటి బుధవారం స్థానిక ఏరియా ఆస్పత్రికి తీసుకొచ్చినట్లు ఆమె తెలిపింది. బాలుడిని పరీక్షించిన అనంతరం వైద్యుల సూచన మేరకు భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ కోటిరెడ్డి తెలిపారు.

చిన్నారుల మరణాలపై విచారణ



సింగన్నగూడెంలో మృతిచెందిన చిన్నారి తల్లిదండ్రుల నుంచి వివరాలు సేకరిస్తున్న కమిటీ సభ్యులు

చింతూరు: మండలంలో ఇటీవల ఐదుగురు చిన్నారుల మృతి వ్యవహారంపై వైద్యశాఖకు సంబంధించిన నలుగురు సభ్యుల కమిటీ బుధవారం ఆయా గ్రామాల్లో విచారణ చేపట్టింది. కమిటీ సభ్యులైన జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ సాధన, రంపచోడవరం అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ శిరీష, చింతూరు డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పుల్లయ్య, చిన్నపిల్లల వైద్యనిపుణుడు డాక్టర్ హర్ష గంగన్నమెట్ట, సింగన్నగూడెం, బొడ్డుగూడెం గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మృతిచెందిన చిన్నారుల తల్లిదండ్రుల నుంచి వారు వివరాలు సేకరించారు. భారీవర్షం కారణంగా వాగులు అడ్డంకిగా మారడంతో కమిటీ సభ్యులు చదలవాడ, వంకగూడెం వెళ్లేందుకు వీలుపడలేదు. ఈ సందర్భంగా జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ సాధన మాట్లాడుతూ విచారణ వివరాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆధ్వర్యంలో కలెక్టర్‌కు నివేదిస్తామని తెలిపారు.

క్లుప్తంగా

గిరిజన హక్కులు, చట్టాలపై అవగాహన

- విద్యార్థులకు సదస్సులు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు, విద్యార్థినులు

సాక్షి,పాడేరు: గిరిజన హక్కులు,చట్టాలు పరిరక్షణపై సమత స్వచ్ఛంద సంస్థ బుధవారం పలు విద్యాలయాల్లో సదస్సులు నిర్వహించింది. స్థానిక గిరిజన సంక్షేమ బాలుర, బాలికల ఆశ్రమ పాఠశాలలు, ఏపీఆర్, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో వేర్వేరుగా విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సుల్లో చట్టాలపై వివరిస్తూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సమత సంస్థ కోఆర్డినేటర్లు సైమన్, సతీష్‌కుమార్, సామాజిక పరిశోధకులు, న్యాయవాది కిమిడి శ్రీనివాస్, సమత ఆర్గనైజర్ గెమ్మెలి సౌజన్య, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



చీఫ్ ఇంజినీర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

మోతుగూడెం: తమ సమస్యలు పరిష్కారం కోరుతూ ఏపీ జెన్‌కో చీఫ్ ఇంజినీర్ వాసుదేవరావుకు కాంట్రాక్ట్ కార్మికులు బుధవారం వినతిపత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులుగా మోతుగూడెం కాంప్లెక్స్ పరిధిలో గత 20 ఏళ్ల నుంచి పనిచేస్తున్న తమను అర్హతను బట్టి స్కిల్, ఆన్ స్కిల్ కార్మికులుగా గుర్తించి జీతాలు చెల్లించాలని కోరారు. పర్మినెంట్ ఉద్యోగుల మాదిరిగా తమకు కూడా వైద్య సదుపాయం కల్పించాలని కోరారు. జెన్‌కోకు చెందిన ఖాళీగా ఉన్న నివాస గృహాలను కాంట్రాక్టు కార్మికులకు ఇప్పించాలని కోరారు. కాంట్రాక్టు కార్మికుడిగా 60 ఏళ్లు పనిచేసి రిటైర్ అవుతున్న వారికి రూ.10 లక్షలు బెనిఫిట్స్ ఇవ్వాలని సీఈని కోరారు. శ్రీను, సన్యాసిరావు, కుమార్, మల్లేష్, రాజు తదితరులున్నారు.

పడకేసిన పంచాయతీ పాలన

- పాడేరు డివిజన్‌లో పంచాయతీ కార్యదర్శుల కొరత
- 224 మందికి 96 మంది మాత్రమే

కొయ్యూరు: కార్యదర్శుల కొరతతో పంచాయతీలలో పాలన పడకేసింది. పంచాయతీలోల 29 రకాల విధులను నిర్వహించే పంచాయతీ కార్యదర్శుల కొరత పాడేరు డివిజన్‌లో నెలకొంది. దీని మూలంగా ఎపిడమిక్ సమయంలో చేయాల్సిన కీలక పనులు చేయలేకపోతున్నారు. ఒక్కో కార్యదర్శి రెండు మూడు పంచాయతీలను పర్యవేక్షించాల్సి వస్తోంది. వర్షాకాలంలో పారిశుధ్యం మెరుగు అత్యంత కీలకం.అయితే దీనిని చేపట్టేందుకు కార్యదర్శులు ఒకేసారి రెండు మూడుచోట్ల విధులు నిర్వహించడం సాధ్యం కావడంలేదు.224 మందికి 96 మంది కార్యదర్శులు ఉన్నారు.కార్యదర్శుల కొరత 57 శాతం ఉంది. గతేడాది కార్యదర్శుల కొరత తీర్చేందుకు అనకాపల్లి జిల్లా నుంచి అల్లూరి జిల్లాకు 20 మందిని నియమించారు. వారంతా మైదాన ప్రాంతంలో ఉన్నారు.మన్యంకు రావడానికి ఇష్టపడడం లేదు. 33 పంచాయతీలున్న హుకుంపేటలో నలుగురు కార్యదర్శులే ఉన్నారు. వారి కొరతను ఉన్నతాధికారుల ద్వారా ప్రభుత్వానికి నివేదించినా ఫలితం లేకపోయింది



మంప గ్రామ సచివాలయం

కార్యదర్శులకు కేటాయించని అధికారాలు

వాస్తవానికి గ్రేడ్–5గా విభజించే సచివాలయ కార్యదర్శులు 142 మంది ఉన్నారు. అయితే సచివాలయ సిబ్బందికి జీతాలు చెల్లించే డీడీవో అధికారాలు లేవు. డీడీవో అధికారులు ఇస్తే చాలా వరకు కార్యదర్శుల కొరతను నివారించవచ్చు. సచివాలయ కార్యదర్శులకు కూడా డీడీవో అధికారాలు ఇవ్వాలని పంచాయతీ అధికారులు కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదించారు. అయితే దీనిపై ప్రభుత్వం విధాన పరమైన నిర్ణయం తీసుకోవలసి ఉంది. సచివాలయ కార్యదర్శులకు డీడీవో అధికారాలు ఇస్తే కార్యదర్శుల కొరత తీరిపోతుంది

త్వరలో సర్దుబాటు ప్రక్రియ

త్వరలో కార్యదర్శులను సర్దుబాటు ప్రక్రియను చేపట్టలని అధికారులు చూస్తున్నారు. ఒక చోట ఎక్కువ మంది మరో చోట తక్కువ మంది ఉంటే సర్దుబాటు చేస్తారు. ఈ సమాచారం తెలుసుకున్న చాలా మంది పంచాయతీ కార్యదర్శులు ఆందోళన చెందుతున్నారు. ఈ మేరకు చాలా మంది పది సంవత్సరాల నుంచి మన్యంలో పనిచేస్తున్నారు. వారంతా మైదాన ప్రాంతాలకు వెళ్లాలని చూస్తున్నారు. సర్దుబాటుల్లో ఇతర మండలాలకు వేస్తారని పంచాయతీ కార్యదర్శుల్లో ఆందోళన నెలకొంది.

నివేదిక పంపాం



పాడేరు డివిజన్‌లో పంచాయతీ కార్యదర్శుల ఖాళీలను కలెక్టర్ దినేష్ కుమార్‌కు నివేదించాం. సచివాలయ కార్యదర్శులకు సంబంధించి డీడీవో అధికారాలు ఇచ్చేందుకు ప్రభుత్వం దీనిపై పాలన పరమైన నిర్ణయం తీసుకోవాలి. ప్రస్తుతం ఖాళీలను సర్దుబాటు చేసేందుకు వీలుగా చర్యలు తీసుకునేందుకు కలెక్టర్ దృష్టిలో ఉంచాం.అనుమతి రాగానే ప్రక్రియను ప్రారంభిస్తాం

– పి.ఎస్.కుమార్, డీఎల్‌పీవో, పాడేరు

9న రక్తదాన శిబిరాలు

కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: ప్రపంచ ఆదివాసీ దినోత్సవం పురస్కరించుకుని ఈనెల 9న పాడేరు, చింతపల్లి ప్రాంతాల్లో రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నామని, కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో రక్తం నిల్వల కొరత ఉందని, ప్రాణాపాయ పరిస్థితులలో ఉన్న వారికి రక్తం అందించడం సమస్యగా ఉన్నందున దాతలంతా మానవత్వం దృష్టితో రక్తదానం చేసేందుకు ముందుకు రావాలన్నారు. పాడేరు ఐటీడీఏ సమావేశ మందిరంలో రెడ్‌క్రాస్ సొసైటీ రక్తదాన శిబిరం నిర్వహిస్తుందన్నారు. చింతపల్లిలోని రెడ్‌క్రాస్ సొసైటి రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తోందని, శిబిరాలకు ఆసక్తి ఉన్న రక్తదాతలంతా తరలివచ్చి రక్తదానం చేయాలన్నారు. ప్రాణాలు కాపాడే రక్తదాతలుగా నిలవాలని కలెక్టర్ కోరారు.

ఈవీఎంలను తరలించండి

కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం

సాక్షి,పాడేరు: గత సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన అరకు, పాడేరు అసెంబ్లీ నియోజకవర్గాల స్ట్రాంగ్ రూమ్‌లను కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ బుధవారం సందర్శించారు. అన్ని రాజకీయ పార్టీల నేతల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌ల సీళ్లను తొలగించి ఈవీఎంలను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడుతూ పార్లమెంట్, అసెంబ్లీ వారీగా ఏబీసీడీ కేటగిరిలుగా ఈవీఎంలను విభజించి, వాటితో పాటు స్టేట్యూటరీ మెటీరియల్‌ను కూడా ఈవీఎంల వేర్‌హౌస్‌కు పటిష్ట భద్రతతో తరలించాలని సూచించారు. బీ,సీ కేటగిరీల ఈవీఎంలను(రిజర్వ్,డిఫెక్టివ్) బెంగళూరులోని బెల్ కేంద్రానికి పంపించాలని ఆయన ఆదేశించారు.ఈవీఎంల తరలింపు ప్రక్రియను వెంటనే పూర్తి చేసి తరగతి గదులను డిగ్రీ విద్యార్థులకు అప్పగించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జేసీ డాక్టర్ అభిషేక్‌గౌడ్, పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజర్ గణేష్‌కుమార్, ఎస్డీసీ వీవీఎస్ శర్మ,డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వి.చిట్టబ్బాయి పాల్గొన్నారు.



ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, జేసీ అభిషేక్ గౌడ్

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సాక్షి,పాడేరు: విద్యుత్ సబ్ స్టేషన్‌లలో ఫీడర్ మరమ్మతులు కారణంగా శుక్రవారం పాడేరు డివిజన్‌లోని పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని, విద్యుత్ పంపిణీ సంస్థ పాడేరు ఈఈ ఎ.వి.ఎన్.ఎం.అప్పారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆరోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

విద్యుత్ నిలిపివేసే గ్రామాలు ఇవే..

- హుకుంపేట సబ్‌స్టేషన్ పరిధిలో సంతారి 11కేవీ ఫీడర్ లోని తాడిపుట్టు, కోట్నాపల్లి, పెదగరువు, రంగశీల, రాప, దారెగెడ్డ గ్రామాలు
- చింతపల్లి మండలం లంబసింగి సబ్‌స్టేషన్ పరిధిలో 11కేవీ రాజుపాకలు ఫీడర్‌లో చిత్రాలుగుప్ప, పెదబరడ, లబ్బంగి, భీమునిమెట్ట గ్రామాలు
- ముంచంగిపుట్టు మండలం 11కేవి మాకవరం ఫీడర్‌లో కించాయిపుట్టు, దరపల్లి, సరియాపుట్టు, మజ్జిగుడ గ్రామాలు
- అరకులోయ మండలంలోని అరకు సబ్‌స్టేషన్ మరమ్మతులు నిమిత్తం అన్ని 11కేవీ ఫీడర్‌ల పరిధిలోని అన్ని గ్రామాల్లోను విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుంది.

పక్కాగా ఎన్నికల ప్రవర్తన నియమావళి





వీడియో సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్, జేసీ అభిషేక్‌గౌడ్, జిల్లా ఎస్పీ అమిత్‌బర్ధర్, వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన అన్ని మండలాల అధికారులు

- కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం
- స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికపై వీడియో కాన్ఫరెన్స్

సాక్షి, పాడేరు: ఉమ్మడి విశాఖ జిల్లాలో స్థానిక సంస్థల నియోజకవర్గానికి సంబంధించి ఈనెల 30న జరగనున్న ఎమ్మెల్సీ ఉప ఎన్నికకుగాను పాడేరు డివిజన్‌లో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పక్కాగా అమలుజేయాలని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ ఆదేశించారు. బుధవారం తన కార్యాలయం నుంచి .జేసీ అభిషేక్‌గౌడ్, ఎస్పీ అమిత్‌బర్ధర్‌తో కలిసి అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలతో వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11 మండలాల ఎంపీడీవోలు ప్రవర్తన నియామావళి నోడల్ అధికారులుగా, తహసీల్దార్లు మండల మేజిస్ట్రేట్‌లుగా వ్యవహరించాలని, ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేస్తున్నామన్నారు. ఈ నెల 6వతేదీన స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి నోటిఫికేషన్ జారీ అయ్యిందని, 30న పోలింగ్,సెప్టెంబర్ 3వతేదీన లెక్కింపు, ఆరవ తేదీలోగా ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుందన్నారు. అప్పటివరకు పాడేరు డివిజన్‌లోని 11 మండలాల్లో ఎన్నికల ప్రవర్తనా నియామావళిని అధికారులు కచ్చితంగా అమలుచేయాలని ఆదేశించారు. రాజకీయ పార్టీలకు సంబంధించిన ప్లెక్సీలు,పోస్టర్లు తొలగించాలని,రాజకీయ నేతల విగ్రహాలకు ముసుగులు వేయాలని, దినపత్రికల్లో వచ్చిన వార్తలపై వెంటనే స్పందించాలని ఆయన ఆదేశించారు.పాడేరు డివిజన్‌లో ఎమ్మెల్యేలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు,కోఆప్షన్ సభ్యులు మొత్తం 177మంది ఓటు హక్కు కలిగి ఉన్నారని, వారందరికి పాడేరు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశామని కలెక్టర్ వివరించారు.

పార్టీల ప్రమేయం లేకుండా ఆదివాసీ దినోత్సవం

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో రాజకీయ పార్టీలు, ఆయా పార్టీల ప్రతినిధులు ప్రమేయం లేకుండా ఈనెల 9వతేదీన ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు.

కోడ్ ఉల్లంఘనలపై కేసులు నమోదు: ఎస్పీ అమిత్ బర్ధర్

ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై కేసులు నమోదు చేస్తామని ఎస్పీ అమిత్‌బర్ధర్ హెచ్చరించారు. ఓటర్లను ప్రభావితం చేసే కార్యక్రమాలపై నిఘా పెట్టి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసు పికెట్లు ఏర్పాటు చేస్తామని, పోలీసు,రెవెన్యూ పరస్పర సహకారంతో ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ బృందాలు పెట్టాలని అధికారులను ఆదేశించారు.

చిన్నారుల ఆరోగ్యానికి ప్రత్యేక ప్రణాళిక

చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య



చింతూరు: చిన్నారుల మరణాల నివారణకు డివిజన్లోని అన్ని గ్రామాల్లో వారి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకునేందుకు ప్రత్యేక ప్రణాళిక చేపట్టినట్లు చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య తెలిపారు. బుధవారం ఆయన స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో మాట్లాడుతూ ఇందుకోసం క్షేత్రస్థాయిలో వైద్యసిబ్బంది, ఆరోగ్య కార్యకర్తల ద్వారా డివిజన్లోని 2,400 మంది 0 నుంచి ఏడాదిలోపు పిల్లలు కలిగిన ఇళ్లను సందర్శించి అనారోగ్య సమస్యలు గుర్తిస్తారని తెలిపారు. వైద్యసిబ్బంది 139 మంది క్షేత్రస్థాయిలో శబరి, గోదావరి నదుల పరివాహక గ్రామాలు, కొండలపై ఉన్న గ్రామాలను సందర్శించి వివరాలు సేకరిస్తారని ఆయన తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న పిల్లలను గుర్తించి వారి పరిస్థితికి అనుగుణంగా పీహెచ్‌సీ, సీహెచ్‌సీలకు తరలించి తగిన వైద్యం అందజేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం పూర్తయిన అనంతరం ప్రతి గ్రామ సచివాలయం పరిధిలో పిల్లల సంఖ్య ఆధారంగా వైద్యశిబిరాలు నిర్వహిస్తారని, పిల్లలకు అవసరమైన మందులను ప్రత్యేకంగా రప్పిస్తామని పీవో తెలిపారు.

ట్రైబల్ హెల్త్ సెల్ ఏర్పాటు

చింతూరు డివిజన్లోని ప్రజలకు అత్యవసర అనారోగ్య సమస్యలుంటే ఇబ్బందుల పడకుండా చింతూరు ఐటీడీఏలో ట్రైబల్ హెల్త్ సెల్ ఏర్పాటు చేసినట్లు పీవో చైతన్య తెలిపారు. ఈ కేంద్రం 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటుందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో 108, అంబులెన్సులు కావాలన్నా, ఇతర అత్యవసర సేవల కోసం ఫోన్ ద్వారా సంప్రదించాలని ఆయన సూచించారు. 108 వాహనం కావాల్సిన వారు ముందుగా 108 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలని, వాహనం రావడం ఆలస్యమైతే హెల్త్ సెల్‌కు ఫోన్‌చేసి అంబులెన్సు సదుపాయం పొందవచ్చని పీవో పేర్కొన్నారు.

బోసిపోయిన పర్యాటక ప్రాంతాలు



పర్యాటకులు లేక ఖాళీగా ఉన్న గిరిజన మ్యూజియం



పర్యాటకులు లేని చాపరాయి జలపాతం



మూసిఉన్న చాపరాయి జలపాతం ప్రధాన గేటు

అరకులోయ రూరల్: ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయలో బుధవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షానికి జనజీవనం స్తంభించింది. ఈ ప్రాంతానికి వచ్చే పర్యాటకుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. దీంతో అరకులోయలోని సందర్శిత ప్రాంతాలైన గిరిజన మ్యూజియం, పద్మాపురం గార్డెన్, రణజిల్లెడ జలపాతం, కాఫీ మ్యూజియం తదితర ప్రాంతాలు బోసిపోయాయి.

డుంబ్రిగుడ: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రం చాపరాయి బుధవారం పర్యాటకులు లేక బోసి పోయింది. ఉదయం నుంచి భారీ వర్షం కురుస్తుండటంతో సందర్శకులు రాలేదు. రెండు వారాల క్రితం కురిసిన భారీ వర్షాలకు చాపరాయి పర్యాటక కేంద్రాన్ని వారం రోజులపాటు మూసివేశారు.

సీజనల్ వ్యాధులపై కళాజాత



ప్రదర్శనను తిలకిస్తున్న విద్యార్థులు

ముంచంగిపుట్టు: మండలంలోని బంగారు మెట్ట పంచాయతీ కేంద్రంలో స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో కళాజాత కార్యక్రమం నిర్వహించారు. సీజనల్ వ్యాధులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సికిల్సెల్ అనీమియా, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కిలగాడ వైద్యాధికారిని శిరీష మాట్లాడుతూ వ్యాధుల పట్ల విద్యార్థుల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎటువంటి అనారోగ్య సమస్యలను వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. ముఖ్యంగా బాలికల్లో రక్తహీనత సమస్య ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. హెచ్ఎం రాజేశ్వరి, ఆరోగ్య విస్తరణ అధికారి సుబ్రహ్మణ్యం, వైద్య సిబ్బంది, కళాజాతర బృందం పాల్గొన్నారు.

సోలార్ వినియోగంపై అవగాహన

అరకులోయ రూరల్: మండల కేంద్రంలో టాటా పవర్ సోలార్ ఆధ్వర్యంలో సోలార్ వినియోగం, ప్రాధాన్యతపై అవగాహన కార్యక్రమం బుధవారం జరిగింది. సంస్థ హెడ్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు రాయితీ అందిస్తున్నట్టు చెప్పారు. సోలార్ వినియోగంతో విద్యుత్ మరింత ఆదా అవుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సూర్య ఘర్ యోజన పథకం ద్వారా సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుకు రూ.78వేలకు పైగా రాయితీ ఉంటుందన్నారు. ఏపీ ఈపీడీసీఎల్ ఏఈఈ సత్యనారాయణ, మహవీర్ ఇంజినీర్, గోపాల్ రెడ్డి, సాంబయ్య పాల్గొన్నారు.

రహదారులు జలమయం



చిత్తడిగా మారిన కుసుమగుడ రహదారి



ఎత్తిన సూరంపాలెం గేట్లు



గంగవరంలో హైవేపై వరద నీరు

అరకులోయ రూరల్/డుంబ్రిగుడ/కొయ్యూరు/గంగవరం : జిల్లాలో బుధవారం ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. దీంతో స్థానికులు, వాహనచోదకులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రహదారులపై భారీగా వర్షపు నీరు చేరడంతో వాహనచోదకులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. గెడ్డలు, వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. డుంబ్రిగుడలోని కించుమండ వారపు సంత బోసిపోయింది. వర్షంతో వ్యాపారులు, కొనుగోలుదారులు ఇబ్బందులు పడ్డారు. కుసుమగుడలోని చేపడుతున్న జాతీయ రహదారుల పనుల వల్ల ఈ పరిసరాల్లో రహదారి చిత్తడిగా మారడంతో వాహనచోదకులు రాకపోకలకు నానా అవస్థలు పడ్డారు. పొలాల్లో వర్షపునీరు చేరింది. రైతులు సాగు పనులు ప్రారంభించారు.

సూరంపాలెంకు వరద తాకిడి

సూరంపాలెం జలాశయం సాధారణ నీటిమట్టం 105 మీటర్లు. కాగా అంతకు మించి వరదనీరు చేరుతుండటంతో ఒక గేటును ఎత్తి దిగువకు 300 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. పెద్దేరు వాగు నీరు భారీగా ఏలేరు జలాశయంలో చేరుతోంది.

జిప్సంతో నాణ్యమైన దిగుబడి

- ఏరువాక కేంద్రం జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ ప్రదీప్‌కుమార్
- వేరుశనగ రైతులకు సూచన



వేరుశనగ పైరులో జిప్సం వేయడాన్ని చూపిస్తున్న ప్రదీప్‌కుమార్, ఏవో శ్రీనివాస్ తదితరులు

పెదబయలు: వేరుశనగ పైరులో జిప్సమ్ వేయడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని ఏరువాక కేంద్రం జిల్లా కోఆర్డినేటర్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ప్రదీప్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన జాతీయ ఆహార భద్రత పథకం(ఎన్ఎఫ్ఎస్ఎం –2024–2025)లో మండలంలోని గంపరాయి గ్రామ సచివాలయం పరిధిలో ప్రయోగాత్మకంగా రైతులతో 25 హెక్టార్లలో వేయించిన కదిరి లేపాక్షి రకం వేరుశనగ పైరును పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు జిప్సమ్ వేయు విధానంపై గంపరాయిలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేరుశెనగ రెండవ దశ గొప్పులో ఎకరానికి 200 కిలోల జిప్సం మొదలులో వేసి గొప్పు చేయాలని సూచించారు. దీనివల్ల గింజ బరువు పెరిగి, నూనె దిగుబడి అధికంగా ఉంటుందని తెలిపారు. జిప్సం వేసే విధానాన్ని తెలియజేశారు. మండల వ్యవసాయ అధికారి ఏ.శ్రీనివాస్, ఉద్యానవన సహాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

జీసీసీ లక్ష్యం అధిగమించేందుకు కృషి

- 2500 టన్నులు కాఫీ కొనుగోలుకు ప్రణాళిక ఇవ్వాలి
- గిరిజన సహకార సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కల్పనకుమారి



జీసీసీ ఉత్పత్తులను పరిశీలిస్తున్న ఎండి కల్పనకుమారి, ఐటీడీఏ పీవో అభిషేక్

అరకులోయ రూరల్: గిరిజన సహకార సంస్థ లక్ష్యంని అధిగమించేల ఈ ఏడాదిలో ప్రణళీక ఇవ్వలని గిరిజన సహకార సంస్థ అధికారులను ఆమే ఆదేశించారు, మండలంలో బుదవారం గిరిజన సహకార సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ (జీసీసీ ఎండి) కల్పన కుమారి, పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్‌తో కలిసి పర్యటించారు. ఇందులో భాగంగా గిరిజన సహకార సంస్థ కార్యాలయాన్ని సందర్శించి, సోప్ తయారీ యూనిట్‌ను పరిశీలించారు. ఇక్కడ తయారవుతున్న సబ్బులు, రవాణా, ప్యాకింగ్ తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. మరింత సబ్బులు తయారు చేసి మార్కెటింగ్ మరింత పెంచి జీసీసీకి ఆదాయం మరింత సమకూర్చేవిధంగా కృషి చేయాలన్నారు, మూతబడిన యూనిట్ 10రోజుల్లో తెరిపించాలని అధికారులను ఆదేశించారు. తురాయిగుడ సమిపంలో నాంది సంస్థ ఆధీనంలో ఉన్న కాఫీ యూనిట్‌లను సందర్శించి కాఫీ కొనుగోలు వివరాలపై ఆరా తీశారు, అనంతరం గిరిజన సహకార సంస్థ అధికారులతో ఆమె మాట్లాడుతు ఈ ఏడాదిలో జీసీసీ, ఐటిడిఏ సంయుక్తంగా కాఫీ కొనుగోలు చేయాలన్నారు, గతం కంటే వచ్చే సీజనల్‌లో 2500 టన్నులు కొనుగోలు లక్ష్యంగా సిద్ధం కావలన్నారు, కాఫీ కొనుగోలుకు సంబంధించి పూర్తి స్థాయిలో ప్రణాళిక ఇవ్వాలన్నారు. జీసీసీ ఎండి సింహచలం, అరకులోయ బ్రాంచి మేనేజర్ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

దాతల ఔదార్యం

పేదింటి చిన్నారి చికిత్సకు ఆర్థిక సాయం



చిన్నారి తల్లికి నగదు అందజేస్తున్న సర్పంచ్ నాగమణి

కూనవరం: మండల పరిధిలోని పెదార్కూరు సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న మహిళా పోలీస్ సుకన్య మూడు సంవత్సరాల కుమారుడు కోడి ప్రజ్ఞా హృత్విక్ గత శనివారం జరిగిన ప్రమాదంలో రోడ్డుపై ఆడుకుంటుండగా ట్రారీ ఆటో ఢీకొనడంతో కిందపడిపోవడంతో నడుమ భాగాన దెబ్బతగిలింది. తల్లిదండ్రులు వెంటనే భద్రాచలంలోన ప్రయివేటు ఆస్పత్రిలో జాయిన్‌చేశారు. ఈ మేరకు చిన్నారి శస్త్రచికిత్సకు రూ.2లక్షలకు పైగా అవుతుందని సిబ్బంది తెలిపారు. నిరుపేద అయిన చిన్నారి తల్లిదండ్రులు ఆలోచనలో పడ్డారు. ఈ విషయం తెలుసుకున్న పోచవరం గ్రామస్తులు, చినార్కూర్ సర్పంచ్ మడకం నాగమణి, సహచర మహిళా పోలీసులు, సచివాలయ ఉద్యోగులు, గణేష్ యూత్ సభ్యులు తమ వంతు ఆర్థిక సహాయం అందించారు. దాతల సహకారంతో తమ చిన్నారి ఆపరేషన్ సజావుగా జరిగినట్టు బాలుడి తల్లిదండ్రులు సుకన్య, శివలు తెలిపారు. ఈ సందర్భంగా దాతలందరికీ ప్రత్యేక కృతజ్ఞలు తెలిపారు.